క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



పరుగు పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఉరవకొండ: క్రీడల్లో విద్యార్థులు మరింత రాణించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ ఈశ్వరప్ప తెలిపారు. బుధవారం స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. యోగా, షటిల్, చెస్, పరుగు పందెం తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, పీఈటీలు మారుతి ప్రసాద్, ప్రభాకర్, మంజునాథ్, చంద్ర, లక్ష్మి, అనిత, లత తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాళ్‌కు నివాళి

రాయదుర్గంటౌన్: బీజేపీ సిద్ధాంతకర్త, జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బుధవారం రాయదుర్గంలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ 108వ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు వాడేకర్ అంభోజీరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధర, కో కన్వీనర్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనాల పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

బొమ్మనహాళ్: స్థానిక పీహెచ్‌సీ పాత, నూతన భవనాలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు, వివిధ పార్టీల నాయకులతో కలసి తహసీల్దార్ షర్మిల బుధవారం పరిశీలించారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌కు తహసీల్దార్ కార్యాలయాన్ని పాత పీహెచ్‌సీలోకి మార్చాలని వినతిపత్రం ఇవ్వడంతో నివేదికలు పంపాలని ఆదేశించారు. దీంతో బుధవారం తహసీల్దార్ నూతన పీహెచ్‌సీని పరిశీలించారు. పాత పీహెచ్‌సీ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చేలా యథాస్థితిగతులపై కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ హుస్సేన్‌పీరా, ఆర్‌ఐ నగేష్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు

ఉరవకొండ: స్థానిక లత్తవరం రోడ్డు వద్ద ఉన్న తొగట వీరక్షత్రియ కళ్యాణ మండపంలో ధర్మవరానికి చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉరవకొండ చౌడేశ్వరీ వీవర్స్ సంక్షేమ సంఘం సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన శంకర ఐ హాస్పిటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. కంటి శస్త్రచికిత్సలకు 100 మంది ఎంపిక కావడంతో వారిని ఉచితంగా బెంగళూరుకు తరలించారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం నిర్వాహకులు వేల్పుల శ్రీనివాసులు, పెద్దకోట్ల రవి, గట్టు ఎర్రిస్వామి, గుర్రం హరిదాసు, చందారాము తదితరులు తెలిపారు.

అథ్లెటిక్స్‌కు నేడు క్రీడాకారుల ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నుంచి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చల్లా కిరణ్ చౌదరి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన బాలికలు, బాలురు క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలం



రాకెట్లలో విరబూసిన బ్రహ్మకమలం

ఉరవకొండ: రాకెట్ల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు, మాజీ పెన్నహోబిలం ఆలయం చైర్మన్ అశోక్ ఇంట్లో బుధవారం ఎంతో అరుదుగా వికసించే బ్రహ్మకమలాలు విరబూశాయి. ఈ సందర్భంగా అశోక్, అనిత దంపతులు బ్రహ్మకమలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలను తిలకించడానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అంతస్తులు దాటిన అక్రమాలు!

- డ్రైవర్స్ కాలనీలో అక్రమ నిర్మాణాలు పెరిగాయి. మున్సిపల్ అనుమతులు పొందకుండానే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. మూడు నెలల నుంచి ఈ విధానం మరింత ఎక్కువైంది. అడ్డుకోవాల్సిన అధికారులు నోటీసులతోనే సరిపెట్టేస్తున్నారు.
- పట్టణంలోని కోతిగుట్ట, రాజీవ్‌గాంధీకాలనీ, కొలిమివీధి, మొలకాల్మూరు రోడ్డు, మేదరవీధి, శాంతినగర్, కణేకల్లు రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు ఎక్కువయ్యాయి. కనీసం జీ+1 కూడా కొందరు అనుమతులు పొందడం లేదంటే వారికి రాజకీయబలం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

- నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు
- ఆదాయం కోల్పోతున్న పురపాలక సంఘం
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు



డ్రైవర్స్ కాలనీలో కొనసాగుతున్న అక్రమ భవన నిర్మాణం

రాయదుర్గం: కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలు ఎటువంటి అనుమతులు లేకుండా శరవేగంగా సాగుతున్నాయి. అధికార పార్టీ అండదండలు చూసుకుని.. అనుమతులు తీసుకోకుండా.. ప్రభుత్వానికి రుసుము కట్టకుండా ఎగ్గొడుతున్నారు. మరికొందరైతే తీసుకున్న అనుమతులకు.. చేపట్టిన నిర్మాణాలకు ఏమాత్రం పొంతన ఉండడం లేదు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులతో సరిపెట్టేస్తున్నారు. పట్టణంలో ఏటా భవన నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నా అందుకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేపట్టడం లేదు. పాత ప్రణాళికనే అనుసరిస్తుండడంతో అక్రమాలు హద్దులు దాటిపోతున్నాయి. మున్సిపల్ పరిధిలో 75 వేల మంది ఉండగా, 32 వార్డులు ఏర్పాడ్డాయి. వీటిలో 10,582 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుత గణంకాలతో లెక్కిస్తే పట్టణ విస్తరణ రెట్టింపుస్థాయిలో ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణాల అనుమతుల కోసం 44 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వాటిలో 37 భవనాలకు అనుమతులిచ్చారు. మిగిలిన 7 పరిశీలనలో ఉన్నాయి. అనుమతుల రూపంలో మున్సిపాలిటీకి రూ.39.64 లక్షల ఆదాయం సమకూరింది. అక్రమ కట్టడాలపై కౌన్సిల్‌లో సభ్యులు తరచూ లేవనెత్తినా అడ్డుకట్ట పడటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొలిమివీధిలో పరిమితికి మించి చేపట్టిన కట్టడాలు

జీ+2 వరకే అనుమతి

మున్సిపల్ నిబంధనల ప్రకారం 300 చ.మీ లోపు జీ+2 వరకే పట్టణంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా జీ+3, జీ+4, జీ+5.. ఆపై అక్రమంగా అంతస్తులు దాటిస్తున్నారు. అధికారులు మాత్రం 40 భవనాలకు నోటీసులు జారీ చేసి చేతులుదులిపేసుకున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొందరు చేతులు తడుపుకుని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



రాజీవ్‌గాంధీ కాలనీలో ఇలా..

అనుమతుల్లేకుండా నిర్మిస్తే చర్యలు



మున్సిపల్ అనుమతులు లేకుండా పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు చేపడతాం. టౌన్‌ప్లానింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. జీ+2కు మించి నిర్మాణాలు చేపట్టే వాటిని గుర్తిస్తాం. ఇప్పటికే నోటీసులు అందుకున్న వారిపై చర్యలకు ఉపక్రమిస్తాం. ప్రభుత్వ ఖజానాకు గండికొట్టేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు. అక్రమ నిర్మాణాలకు ఆస్కారం లేకుండా చూస్తాం. – దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పరామర్శ



పందికుంట తండాలో కీమే నాయక్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

వజ్రకరూరు: పందికుంట, పందికుంట తండా గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విస్తృతంగా పర్యటించారు. పందికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని ఎన్.అనిల్ ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త జూటూరు కిష్టయ్య సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక కొద్ది రోజుల క్రితం మరణించాడు. ఈ సందర్భంగా విశ్వ.. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన చిన్నపీరాసాబ్ కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కీమే నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మృతుల కుటుంబాలకు సూచించారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ.వీరన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు కేవీ రమణ, సర్పంచ్ ఉమామహేశ్వరి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, సీనియర్ నాయకులు రత్నశేఖర్, హిమవంత్ రాజు, వెంకట్రామిరెడ్డి, బాణేనాయక్, కసి నేనాయక్, మీసాల సుంకన్న, సురేంద్ర, కిశోర్, నాగరాజు, నరిసింహులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

కళ్యాణదుర్గం రూరల్: ఈనెల 30న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలో పలుమార్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా లంచం ఇవ్వాల్సి వస్తోందన్నారు. ముట్టడి కార్యక్రమానికి జేఏసీ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



చెస్ ఆడుతున్న విద్యార్థులు

కంబదూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సర్పంచ్ రాజగోపాల్, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, యోగా, బాట్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని 8 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కోఆర్డినేటర్ ఓబుశేషి తెలిపారు. పోటీల్లో రాణించిన విద్యార్థులన నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. పాఠశాల కమిటీ చైర్మెన్ పరమేష్, వైస్ చైర్మన్ ప్రసాద్, పీఈటీ సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలి



వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు తక్షణమే రూ.20వేల పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, ఏపీ రైతు సంఘం నాయకులు రమేష్, మధు, కృష్ణానాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తదితరులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రఘును కలిసి వినతిపత్రం అందజేశారు. పెట్టుబడి సాయాన్ని వెంటనే ఇవ్వడంతోపాటు 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలని, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలని కోరారు. రూ.2 లక్షల వరకు రైతు రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చరాదని, జీవో 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు రైతు సేవ కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా అందించాన్నారు.

ఆశాజనకంగా పంటలు



కమ్మూరు వద్ద కళకళలాడుతున్న ఆముదం



శివరాంపేట వద్ద ఏపుగా పెరిగిన కంది

కూడేరు: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు మండలంలో సాగైన కంది, ఆముదం, వేరుశనగ పంటలు కళకళలాడుతున్నాయి. తెగుళ్లు సోకకపోతే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. శివరాంపేట, ఉదిరిపికొండ, కూడేరు, కమ్మూరు, అరవకూరు, ఇప్పేరు. మరుట్ల, జల్లిపల్లి, కొర్రకోడు, పి.నారాయణపురం, కరుట్లపల్లి, ముద్దలాపురం, కడదరకుంటతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లో వేరుశనగ, సుమారు 4,000 ఎకరాల్లో ఆముదం, 200 ఎకరాల్లో కంది సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు

ఉరవకొండ: ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉరగాద్రి చౌడేశ్వరీ దేవస్థానంలో ఆలయ చైర్మన్ కొత్త శరత్ చేతుల మీదుగా పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్త శరత్ మాట్లాడుతూ.. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 3న బాలత్రిపురసుందరీ, 4న గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపురసుందరీ, 7న మహచండీ దేవి, 8న మహలక్ష్మీ దేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. దేవి నవరాత్రుల ఉత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్కా ఎర్రిస్వామి, చిట్టారఘుబాబు, ఆర్సీ ప్రసాద్, ధనంజయ, రెడ్డి ఆంజనేయులు, రామన్న, నిమ్మల ప్రసాద్, ఉట్టినారాయణ స్వామి, కొత్తశ్యాం, చెంగల నాగరాజు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

బొమ్మనహాళ్: నియోజకవర్గ కేంద్రంలో కొనసాగిన స్కూల్ గేమ్స్‌లో బొమ్మనహాళ్ శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. చెస్ అండర్-14లో హేమంత్ ప్రథమ స్థానంలో నిలువగా, అండర్-17లో నిఖిల్ ఐదవ స్థానంతో నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించారు. అథ్లెటిక్స్ 200 మీటర్ల పరుగులో చందన రెండవ స్థానంలో నిలిచింది. బ్యాడ్మింటన్‌లో అండర్-14 బాలికల విభాగంలో గాయిత్రి రెండవ స్థానం, అండర్-17లో రోజా, బ్రహ్మేశ్వరి రెండవ స్థానం సాధించారు. అండర్-17 బాలుర విభాగంలో వర్ధన్ ప్రసాద్, హేమేశ్వర్‌రెడ్డి రెండవ స్థానంతో జిల్లా పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను మండల ఎంఈఓ మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమలు అభినందిస్తూ జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు




కలగళ్లలో చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు: మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో బుధవారం ఇమ్యూనైజేషన్ (టీకాలు వేసే) కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. ఐదేళ్ల లోపు పిల్లలకు క్షయ వ్యాధి సోక కుండా బీసీజీ, అలాగే ఐదు రకాల పెంటావ్యాలెంట్ టీకాలను వేశారు. గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఎంఎల్‌హెచ్‌పీలు శ్రీవిద్య, మాధవి, మీనాక్షి, లోకేశ్వరి, షిరీన్, రాణి, కరిష్మా, చంద్రకళ, జయ తెలిపారు. టీకాలు వేయించకపోతే ఇమ్యూనిటీ తగ్గి వ్యాధుల బారినపడి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దసరాకు బెంగళూరు-విజయపురకు ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 9, 12 తేదీల్లో రాయదుర్గం మీదుగా బెంగళూరు – విజయపురకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ్ కనుమడి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 9, 12 తేదీల్లో బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టర్మినల్ (ఎస్ఎంవీటీ) నుంచి విజయపురకు సాయంత్రం 7 గంటలకు బయల్దేరి రాయదుర్గం (తెల్లవారు జామున 2.20 గంటలకు) మీదుగా ఉదయం 10.30 గంటలకు విజయపుర(బీజాపూర్) చేరుకుంటుందన్నారు. అలాగే తిరుగుప్రయాణంలో అక్కడి నుంచి 10, 13 తేదీల్లో విజయపుర నుంచి సాయంత్రం 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 11.15 గంటలకు బెంగళూరు ఎస్ఎంవీటీకి ప్రత్యేక రైలు చేరుకుంటుందన్నారు.

పంటల్లో లోపాలపై స్పష్టత ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సాయికుమార్

బొమ్మనహాళ్: పంటల్లో పోషక లోపం ఏది.. తెగుళ్ల లోపం ఏది అనేదానిపై స్పష్టత ఉండాలని మండల వ్యవసాయాధికారి సాయికుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉద్దేహాళ్‌లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో అధునిక పద్ధతుల ద్వారా కలుపు నివారణ, సస్యరక్షణపై అవగాహన కల్పించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

బొమ్మనహాళ్: పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఈఓపీఆర్‌డీ దాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం విలేకరులకు వెల్లడించారు. బొల్లనగుడ్డం పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఉంతకల్లు కార్యదర్శి రవికుమార్, బొమ్మనహాళ్ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, దర్గాహొన్నూరు కార్యదర్శి కుళ్లాయినాయుడులు వజ్రకరూరు, విడపనకల్లు, రాప్తాడు ప్రాంతాలకు బదిలీ అయ్యారని తెలిపారు. అలాగే గుంతకల్లు నుంచి గోవిందరెడ్డి బొల్లనగుడ్డం పంచాయతీకి, వజ్రకరూరు నుంచి జి.వెంకటేష్ దర్గాహొన్నూరుకు, పెద్దవడుగూరు నుంచి కృష్ణారావు బొమ్మనహాళ్‌కు, డి.హీరేహాళ్ నుంచి నాగరాజు శ్రీధరఘట్ట పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వస్తున్నట్లు చెప్పారు.

డీఈ, ఏఈల నియామకం

రాయదుర్గంటౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా రాయదుర్గం పురపాలక సంఘానికి ఒక డీఈఈ, ఇద్దరు ఏఈలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డీఈగా కర్నూలు నుంచి రవిప్రకాష్‌నాయుడును ఇక్కడికి బదిలీ చేశారు. ధర్మవరం, గూడూరు మున్సిపాలిటీల నుంచి ఏఈలుగా ప్రతాప్, నరసింహులును రాయదుర్గంకు బదిలీ చేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఘనంగా మారెమ్మ జాతర



కార్యకర్తలతో మాట్లాడుతున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: కొత్తూరులో బుధవారం మారెమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య మారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత వీరేష్ ఇంటిలో విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, లాయర్ హనుమంతరెడ్డి, నరసింహులు, అక్కమ్మగార్ల ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కిరిటీ యాదవ్, బోరంపల్లి రామిరెడ్డి, మురళీ, గొల్ల సూరి, గోపాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, దొణస్వామి, ఈరన్న పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



స్టేట్ బ్యాంక్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు

కూడేరు: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ వద్ద హెచ్చెల్సీ కెనాల్ పక్కన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. వేగంగా వస్తున్న వాహనదారులు రెండు అడుగుల లోతు గుంతలు కనిపించడంతో సడన్‌గా బ్రేకు వేయడంతో వెనుక వస్తున్న వాహనాలు ఢీకొని రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే పలవురు ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యారు. కానీ సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

తిరుపతి - కదిరిదేవరపల్లి రైలు రద్దు మళ్లీ పొడిగింపు

రాయదుర్గంటౌన్: తిరుపతి–కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు రాయదుర్గం మీదుగా ఇప్పట్లో రాకపోకలు సాగించే పరిస్థితి కనిపించడంలేదు. హుబ్లీ డివిజన్‌లో జరుగుతున్న యార్డు ఆధునీకరణ పనుల్లో భాగంగా ఈ రైలును రైల్వే అధికారులు గత జనవరి నుంచి తరుచూ రద్దు చేస్తూ వస్తున్నారు. కదిరిదేవరపల్లి–తిరుపతి(07590), తిరుపతి–కదిరిదేవరపల్లి(07589) ప్యాసింజర్ రైళ్ల రద్దును తాజాగా మరో నెల రోజుల పాటు పొడిగించారు. ఈ నెల 31 వరకు ఉన్న రద్దును నవంబర్ 1వ తేదీ వరకూ పెంచారు. ఈ మేరకు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలును తాత్కాలికంగా రద్దు చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత త్వరగా కదిరిదేవరపల్లి రైలును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాడితో అదనపు రాబడి



ఆవుదూడకు ఇంజక్షన్ వేస్తున్న పశువైద్యాధికారి రమేష్

బొమ్మనహాళ్: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, మేకలు గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం చేపడితే అదనపు ఆదాయం వస్తుందని ఏఓ పృథ్వీసాగర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోనాపురంలో హెచ్ఓ కృష్ణతేజ, పశు వైద్యాధికారి రమేష్, ఎంపీఏఓ మల్లేష్‌తో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఉద్యానశాఖ పథకాలు, రాయితీలపై హెచ్ఓ వివరించారు. డ్రిప్ ఇరిగేషన్‌పై సబ్సిడీ వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు హనుమంత రాయుడు, సుదర్శన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుమ్మఘట్ట: యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. గుమ్మఘట్ట సమీపంలో బుధవారం 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, సస్యరక్షణ చర్యలు, వివిధ పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్, మార్కెట్ యార్డ్ సిబ్బంది రాజారెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.